క్లుప్తంగా

బాటసారులకు మజ్జిగ పంపిణీ



ఏలేశ్వరంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న సంఘ అధ్యక్షుడు, వైద్యుడు విజయబాబు

ఏలేశ్వరం: వారపు సంతను పురస్కరించుకుని పట్టణంలో బాటసారులు, ప్రజలకు గురువారం ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు, వైద్యుడు ఎస్.విజయబాబు మాట్లాడుతూ ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి గోళ్ల నాగేశ్వరరావు, సభ్యులు తాళ్లూరి గొల్లాజీరావు, రొతు సహదేవుడు, వరుపుల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన సర్వే పూర్తి చేయాలి



కిర్లంపూడిలో మహిళా మార్టును పరిశీలిస్తున్న శ్రీనివాసులు

కిర్లంపూడి: ఎన్యూమరేటర్లు గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని డీఆర్‌డీఏ సంచాలకులు జి. శ్రీనివాసులు సూచించారు. స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం నిర్వహిస్తున్న వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళికల సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. స్థానిక మహిళా మార్టును పరిశీలించి, మార్టులో సేల్స్ పెంచేందుకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఏపీఎం ఎస్.వేదకుమారి, సీసీలు ఎన్.బుల్లియ్య, కె.సత్యప్రసాద్, విఓఏఎం సరస్వతి తదితరులు ఉన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన



సింగరంపాలెంలో సబ్‌స్టేషన్‌కు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

గండేపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రానున్న రోజుల్లో ప్రతిఇంటికీ సబ్సిడీపై సోలార్ ప్యానెల్స్ అందజేయనున్నట్టు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. మండలంలోని సింగరంపాలెంలో రూ.3.29 కోట్లతో నిర్మించనున్న 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు గురువారం ఆయన భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే సింగరంపాలెం, రామయ్యపాలెం, ఎన్టీ రాజాపురం గ్రామాలకు లోఓల్టేజ్ సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచె రాజా, నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, కోర్పు లచ్చయ్యదొర, సాయితేజ, కందుల చిట్టిబాబు, యర్రంశెట్టి బాబ్జి, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

జగ్గంపేట: మండలంలోని పలువురు బాధితులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను గురువారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పంపిణీ చేశారు. జెడ్ రాగంపేట, తామరాడ, కాట్రావులపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నేతలు కందుల చిట్టిబాబు, బాబ్జి, సుంకర సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ క్రియాశీలక సభ్యుల సమావేశం

ప్రత్తిపాడు: నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం గ్రామ 'గావ్ ఛలో అభియాన్' కార్యక్రమం నిర్వహించాలని బీజేపీ ప్రోగ్రాం ఇన్‌చార్జి కామర్సు చిరంజీవి కోరారు. ప్రత్తిపాడు బీజేపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం నియోజకవర్గ స్థాయి బీజేపీ క్రియాశీలక సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎనిమిది గంటల పాటు పర్యటించాలన్నారు. స్వాతంత్య్ర పోరాటంలో అసువులు బాసిన మహాత్ముల విగ్రహాల వద్ద ఈ నెల 13 సాయంత్రం జ్యోతిని వెలిగించాలన్నారు. 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శింగిలిదేవి సత్తిరాజు, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు చిత్ర పాపారావు, బీజేపీ కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు విజయ్ కుమార్, బీజేపీ నాయకులు జి రాజబాబు, కంద వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షలకు వేళాయె..!

- గురుకుల, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో ఎంట్రన్స్ టెస్టులకు సర్వం సిద్ధం
- 13, 21, 25, 27 తేదీల్లో పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



వి.కొత్తూరులో కస్తూర్భాగాంధీ బాలికా విద్యాలయం



వి.కొత్తూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల

తుని రూరల్: పేద విద్యార్థులు ఉచిత విద్య అభ్యసించేందుకు ఏర్పాటు చేసిన వివిధ గురుకుల పాఠశాలల్లో ప్రవేశ పరీక్షలకు వేళాయింది. తుని నియోజకవర్గంలో కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాల, ఏపీ రెసిడెన్సియల్ స్కూల్, మహాత్మ జ్యోతిబాపూలే (ఎంజేపీ) బాలురు వెనుకబడిన విద్యాలయం, గిరిజన ఆశ్రమ పాఠశాల, ఆంధ్ర ప్రదేశ్ ఆదర్శ విద్యాలయం (ఏపీ మోడల్ స్కూల్)లో ఐదు, ఆరు తరగతుల్లో ప్రవేశాలకు ప్రతిభా పరీక్షలు ఈ నెలలో నిర్వహించేందుకు ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంటర్మీడియెట్‌లో మార్కుల ఆధారంగా నేరుగా ప్రవేశాలు కల్పించనున్నారు. తుని, కోటనందూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో నేరుగా ఐదో తరగతి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఆయా పాఠశాలలు, కళాశాలల్లో వెయ్యికిపైగా సీట్లకు గాను నాలుగు వేల ఆన్‌లైన్ దరఖాస్తులు నమోదయ్యాయి.

నేటితో ముగుస్తున్న గడువు

తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో మూడు కస్తూర్బా గాంధీ విద్యాలయాలు ఉన్నాయి. బడిమానేసిన, తల్లిదండ్రులు లేని, గ్రామాల్లో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబాలకు చెందిన బాలికలకు కేజీబీవీల్లో ప్రవేశాలు లభిస్తాయి. ఒక్కొక్క కేజీబీవీలో ఆరో తరగతిలో 40, ఇంటర్మీడియెట్‌లో 40 చొప్పున సీట్లు ఉన్నాయి. ప్రవేశ దరఖాస్తులకు శుక్రవారంతో గడువు ముగుస్తుంది. ఇందులో చేరేందుకు ప్రవేశ పరీక్ష రాయాల్సిన అవసరంలేదని, అర్హత, ప్రతిభ ప్రమాణికంగా ప్రభుత్వమే సీట్లు భర్తీ చేస్తుందని వి.కొత్తూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ అమృతవాణి తెలిపారు. ఇంటర్మీడియెట్‌లో మార్కులు ఆధారంగా సీట్లు కేటాయిస్తారన్నారు.

13న ఎస్సీ గురుకుల ప్రవేశ పరీక్ష

సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో తుని మండలం వి.కొత్తూరు, లోవకొత్తూరుల్లో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశాలకు ఈ నెల 13న పరీక్షలు నిర్వహించనున్నారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12 గంటలు వరకూ, ఇంటర్మీడియెట్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం రెండు గంటల నుంచి 4.30 గంటలు వరకు జరగనుందని ప్రిన్సిపాల్ నిర్మల కుమారి తెలిపారు. ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు గంట ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకుని హాల్ టికెట్లను తనిఖీ చేయించుకోవాలన్నారు.

21 ఏపీ మోడల్ స్కూల్‌కు..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో తుని మండలం హంసవరం, శంఖవరంలో ఉన్న ఆంధ్ర ప్రదేశ్ ఆదర్శ విద్యాలయాలు (రెండు ఏపీ మోడల్ స్కూళ్లు) ఉన్నాయి. ఈ స్కూళ్లలో ఆరో తరగతి ప్రవేశాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 21న ప్రతిభ పరీక్ష నిర్వహిస్తున్నట్టు హంసవరం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మజ తెలిపారు. ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు మే 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. పదో తరగతి మార్కులు ఆధారంగా ఇంటర్మీడియెట్ సీట్లు కేటాయించనున్నట్టు తెలిపారు.

25న ఏపీ రెసిడెన్షియల్ ప్రవేశ పరీక్ష

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని జగన్నాథగిరి, భూపతి పాలెంలో ఉన్న ఆంధ్ర ప్రవేశ్ వెనుకబడిన తరగతుల (ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్ల)లో ఐదో తరగతి ప్రవేశ పరీక్షలు ఈ నెల 25 కాకినాడలో జరగనున్నాయి. బాలురు 80, బాలికలు 80 సీట్ల భర్తీకి ఆ రోజు ఉదయం పది గంటల నుంచి 12 గంటలు వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. అదే రోజు 6, 7, 8, 9, తరగతుల్లో ఖాళీల భర్తీకి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రతిభకనబర్చిన విద్యార్థుల (ఎంపికైన) జాబితాను ఈ నెల 27న ప్రకటిస్తామన్నారు.

27న ఎంజేపీ ప్రవేశ పరీక్ష

మహాత్మ జ్యోతిబాపూలే బాలురు విద్యాలయంలో ఐదో తరగతిలో 40 సీట్లు భర్తీకి ప్రవేశ పరీక్ష ఈ నెల 27న నిర్వహించనున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన విద్యార్థులు హాల్ టికెట్లను పరీక్షకు వారం రోజులు ముందు నుంచే డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, హాల్ టికెట్‌లో పరీక్ష సమయం ఉంటుందని హెచ్ఎం యజ్ఞ తెలిపారు. అలాగే ఐదు, ఆరు, 7, 8 తరగతుల్లో ఖాళీలకు 28న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు చెప్పారు.

దొరబాబు కుటుంబానికి మాజీ సీఎం జగన్ పరామర్శ

తుని రూరల్: గత నెల 19న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, తన స్నేహితుడైన కుసనం దొరబాబు కుటుంబ సభ్యులను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఫోన్‌లో పరామర్శించారు. ఎస్.అన్నవరం తన నివాసంలో ఉన్న దొరబాబు భార్య, ఎంపీటీసీ సభ్యురాలు కుసనం పూర్ణలక్ష్మీ శాంతి, మేనల్లుడు సాయిరామ్‌లకు వైఎస్ జగన్ ఫోన్ చేసి మాట్లాడారు. ప్రమాదం గురించి మాజీ మంత్రి దాడిశెట్టి రాజా చెప్పారన్నారు. మంచి మనిషి దొరబాబు మృతి చెందడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

వాహనాలకు బహిరంగ వేలం

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ప్రత్తిపాడు, కిర్లంపూడి, శంఖవరం, ఏలేశ్వరం మండలాల్లోని వివిధ కేసుల్లో పట్టుబడిన 18 మోటారు సైకిళ్లు (బైక్‌లు), రెండు ఆటోలకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జయమాణిక సమక్షంలో వేలం నిర్వహించారు. ఈ వాహనాలకు కనీస ధరగా రూ. 1,15,300 ట్రాన్స్‌పోర్ట్ అధికారులు నిర్ణయించారు. కాగా వాహనాలకు వేలం ద్వారా రూ.2,13 లక్షలు, జీఎస్టీ ద్వారా మరో రూ.30,510 వెరసి రూ.2,43,510 ఎక్సైజ్ శాఖకు సమకూరింది. ఈ వేలం ప్రక్రియలో ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్, ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా శ్రీపుష్పయాగం

ఏలేశ్వరం: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని లింగంపర్తిలో బుధవారం రాత్రి స్వామి, అమ్మవార్ల శ్రీపుష్పయాగం వైభవంగా జరిగింది. గ్రామంలో వుడతల వంశీయులు ప్రతిష్ఠించిన సీతారామచంద్రస్వామి ఆలయంలో పండితులు చక్రవర్తుల రాఘవాచార్యులు, అర్చకుడు వింజరపు వెంకటప్రసాద్, సత్యరామ్‌గోపాల్ నేతృత్వంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అన్నసమారాధన

శ్రీరామనవమి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని పట్టణంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల హైమావతి, మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ దంపతుల ఆధ్వర్యంలో స్థానిక సత్యనారాయణస్వామి ఆలయం వద్ద వందలాది మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పైల విజయ్‌కుమార్, సుంకర రాంబాబు, శిడగం వెంకటేశ్వరరావు, యిజనగిరి ప్రసాద్, భేరి అరవిందకుమార్, అరవాల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగాలమ్మ గాబు సంబరం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని గజ్జనపూడిలో గంగాలమ్మతల్లి గాబు సంబరం గురువారం ఘనంగా జరిగింది. గింజాల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మూడేళ్లకు ఒక్కసారి గాబు సంబరాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి సారె, చీర సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన తప్పెట గుళ్లు, సువ్వారాట స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదానం నిర్వహించారు.

ఆర్టీసీ ప్రయాణికులకు ఇక్కట్లు



ప్రత్తిపాడు ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో మొరాయించిన బస్సులు

ప్రత్తిపాడు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ)కు చెందిన బస్సులు మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏలేశ్వరం డిపోకు చెందిన కాకినాడ నుంచి పెద్దిపాలెం వెళ్లే బస్సు, కాకినాడ నుంచి శాంతి ఆశ్రమం వెళ్లే బస్సులు సాంకేతిక మరమ్మతులకు గురయ్యాయి. దీంతో రాచపల్లి, ఉత్తరకంచి, పెద్దిపాలెం, ఒమ్మంగి, శరభవరం, గజ్జనపూడి, చింతలూరు, శాంతి ఆశ్రమం వెళ్లే ప్రయాణికులను ప్రత్తిపాడులో దింపేశారు. ఎప్పటికో పెద్దిపాలెం వెళ్లే మరో బస్సులో ప్రయాణికులను ఆర్టీసీ సిబ్బంది పంపేశారు. శాంతి ఆశ్రమం వైపు వెళ్లే వారే సాయంత్రం వరకు మరో బస్సు కోసం వేచి ఉండాల్సి వచ్చింది.

వైభవంగా బోనాల సంబరం



గిడజాంలో ముసలమ్మతల్లి బోనాల సంబరాన్ని ప్రారంభిస్తున్న ముద్రగడ గిరిబాబు

రౌతులపూడి: మండలంలోని గిడజాంలో వేంచేసిన పుంతలో ముసలమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అమ్మవారి బోనాల సంబరం కన్నుల పండువగా జరిగింది. వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బోనాల సంబరాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత గ్రామంలో వేంచేసిన పాదాలమ్మ అమ్మవారిని ఆయన దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం స్థానిక ఎస్సీ పేటలోని బీఆర్ అంబేడ్కర్, మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సీ పేటలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలను కలసి తనతండ్రి, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభాన్ని ఆదరించినట్లే తనను కూడా ఆదరించాలని కోరారు. గుమ్మరేగుల్లో గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న పార్టీ కార్యకర్త సేనాపతి నానాజీని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వాసిరెడ్డి జమీలు, మండల ఉపాధ్యక్షులు సాయి, వాసిరెడ్డి భాస్కరబాబు, గుమ్మరేగుల సర్పంచ్ రాపర్తి రామకృష్ణ, సుంకర రామచంద్రరావు, పుణ్యమంతుల లోవదొర, బందారు నాగు, రౌతు మూలవెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ముఖ్య అనుచరుడు యనమల



యనమల 42 వసంతాల రాజకీయ ప్రస్థానం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు

తుని రూరల్: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు, సీఎం చంద్రబాబునాయుడుకు ముఖ్య అనుచరుడు యనమల రామకృష్ణుడు అని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు వంగలపూడి అనిత, కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గెడ్లబీడు సాయి వేదికలో గురువారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య అధ్యక్షతన 42 వసంతాల యనమల రాజకీయ ప్రస్థానం పుస్తకాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 42 ఏళ్ల రాజకీయ జీవితంలో యనమల 38 సంవత్సరాలు క్యాబినెట్ హోదాలో పని చేశారన్నారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారన్నారు. మంత్రిగా, స్పీకర్‌గా ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన ఘనత యనమలకు దక్కిందన్నారు. రాజకీయాల్లోకి వచ్చిన యువతకు యనమల ఆదర్శనీయుడని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఒకే పార్టీ ఎన్నో పదవులు అలంకరించిన యనమలను తన రాజకీయ గురువుగా భావిస్తున్నానని మున్సిపల్ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. భగవంతుడు ఇచ్చిన అవకాశాలను యనమల రామకృష్ణుడు సద్వినియోగం చేసుకున్నారని మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. క్రమశిక్షణ కలిగిన నాయకుడు యనమల అని మాజీ మంత్రులు చిక్కాల రామచంద్రరావు, నిమ్మకాయల చినరాజప్ప, బుచ్చియ్యచౌదరి పేర్కొన్నారు. కాగా మరో రెండు పుస్తకాలు రాసినట్టు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు వెల్లడించారు. ఆ రెండు పుస్తకాలను త్వరలో విడుదల చేస్తానని తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ సానా సతీష్, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు. కలెక్టర్ షన్మోహన్ మర్యాదపూర్వకంగా యనమలను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

పట్టణాభివృద్ధికి ప్రభుత్వ సహకారం



తునిలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే దివ్య

తుని: రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తుందని పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. స్థానిక ఎల్ఐసీ సెంటర్‌లో ఎన్‌టీఆర్ విగ్రహానికి గురువారం సాయంత్రం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీపీఎస్ నిధులు రూ.3 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యనమల దివ్యతో కలిసి ఆవిష్కరించారు. తుని మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రి నారాయణకు వినతిపత్రం సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే రాజా ఆశోక్‌బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ కుచ్చర్లపాటి రూపాదేవి, తాండవ సుగర్స్ మాజీ చైర్మన్ సుర్ల లోవరాజు, కమిషనర్ వెంకట్రావు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ, ఏపీఓలకు అభినందనలు

గండేపల్లి: స్థానిక ఎంపీడీఓ నాతి బుజ్జి, ఉపాధి ఏపీఓ గంగాభవాని గురువారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి చేతుల మీదుగా మెమెంటోలు అందుకున్నారు. ఉపాధి హామీ పథకంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ పనుల్లో గండేపల్లి మండలం జిల్లాలో రెండో స్థానంలో నిలిచింది. ఈ మేరకు కాకినాడలో జరిగిన సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ, ఏపీఓలకు కలెక్టర్ మెమెంటోలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, ఏపీఓలు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం



కత్తిపూడిలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికుడు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో గురువారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

భూముల రీ సర్వేతో రైతులకు మేలు

- నేడు ప్రారంభం
- భూ తగాదాలు పరిష్కారం



ఉప్పంపాలెంలో రైతులకు సర్వేపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరంలో గురువారం భూ రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలోని పలువీధుల మీదుగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ నెల 15న యర్రవరంలో భూముల రీసర్వే నిర్వహిస్తామన్నారు. రీసర్వేతో భూ వివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. రైతులు తమ పాస్‌బుక్‌లు, ఆధార్‌కార్డులు, డ్యాకుమెంట్‌లు తెచ్చి రీ సర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పొన్నాలు, వీఆర్వోలు మణికంఠ, అప్పారావు, పంచాయతీ కార్యదర్శి రామరాజువర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: భూముల రీసర్వేతో భూ తగాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ ఎం.సూర్యప్రభ అన్నారు. మండలలోని ఒమ్మంగిలో రీసర్వేపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం భూ రీసర్వేపై గ్రామసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు తమ ఆధార్, భూములకు సంబంధించిన పత్రాలతో గ్రామ సభకు హాజరై భూ సమస్యలు, వివాదాలను పరిష్కరించుకోవాలన్నారు. మండలంలోని ఒమ్మంగి, గిరిజనాపురం, పాదురుపాక, కె.కొత్తపల్లి గ్రామాల్లో భూ రీ సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ అవసరాల గోపాలకృష్ణ, గ్రామ పెద్దలు సత్యశెట్టి సీతబాబు, కొప్పన రాజబాబు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఒమ్మంగిలో భూ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



యర్రవరంలో తహసీల్దార్, అధికారుల అవగాహన ర్యాలీ



శృంగరాయుపాలెంలో రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కిర్లంపూడి: భూముల రీ సర్వేతో రైతులకు మేలు జరుగుతుందని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ జి.శ్రావణి అన్నారు. మండలంలోని శృంగరాయునిపాలెంలో రీ సర్వేపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. శృంగరాయునిపాలెంలో శుక్రవారం నుంచి నిర్వహించే రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల సర్వేయర్ షేక్ బషీర్, సర్పంచ్ పట్టు చంటిబాబు, ఎంపీటీసీ గరగా గోవిందు, సెక్రటరీ కె.జ్యోతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

రౌతులపూడి: రీ సర్వేతో గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ ఎస్వీ నరేష్ అన్నారు. మండలంలోని ఉప్పంపాలెంలో గురువారం రీ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. గ్రామంలోని రైతుల నుంచి పలు భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ఈ సర్వేతో సరిహద్దు తగాదాలు, ప్రభుత్వ భూములు తదితర సమస్యలను గుర్తించి పరిష్కరించుకోవచ్చన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ యెనుముల కోటేశ్వరరావు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ పి.రవి, మండల సర్వేయర్ వై.రాజశేఖర్, విలేజ్ సర్వేయర్ ఎస్.విష్ణుకుమారి రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తుని: విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు గురువారం తెలిపారు. పట్టణ పరిధిలో డీమార్ట్ ఏరియా, కొండవారిపేట, సీతారాంపురం, టైలర్స్ కాలనీ, కంకిపాటి వారి గరువు, అమ్మాజీపేట, బంగ్లా రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

తొండంగి: మండలంలోని గోపాలపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని జగ్గంపేట విద్యుత్ శాఖ ఈఈ వీరభద్రరావు గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అన్నవరం ఫీడర్, దేవస్థానం ఫీడర్, సుబ్బరాయపురం ఫీడర్లలో మరమ్మతులు చేయనున్నామన్నారు. ఈ మేరకు గోపాలపట్నం, అన్నవరం, మండపం గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గండేపల్లి: మండలంలోని బొర్రంపాలెం, కాట్రావులపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని తాళ్లూరు, సూరంపాలెం అగ్రికల్చరల్, ఇండస్ట్రీయల్ ఫీడర్స్‌కు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం మూడు వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్ కో ఏఈ కిరణ్ తెలిపారు. అలాగే గండేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని ఎన్టీ రాజాపురం ఫీడర్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం మూడు వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.